
# రుక్మిణి ప్రేమలేఖ



పదవ తరగతి అర్ధ సంవత్సర పరీక్షలు జరిగాయి.

ప్రశ్న పత్రంలో రుక్మిణి ప్రేమ లేఖను గూర్చి వ్రాయుము — అనే ప్రశ్న వుంది. అది పోతనగారి భాగవతం దశమ స్కంధంలోని రుక్మిణీ కళ్యాణ ఘట్టం లోది.

పరీక్షలో పిల్లలు చాలామంది రుక్మిణికి బదులు రుక్క్మిణి అని వ్రాశారు. పరీక్ష పేపరు దిద్దే మాస్టర్లలో కొందరు పాతచింతకాయ పచ్చడి వాళ్లున్నారు. పాత కాలంలో లాగా పిలకలు లేకపోయినా పరీక్ష పేపర్లు దిద్దే వేళ ఎక్కడ లేని చాదస్తం చూపిస్తారు. వాళ్ళ అన్నరు పేపర్లలో రుక్క్మిణి అని వ్రాసి వున్నచోటల్లా అడుగున గీత గీసి మార్కులు చాలా తగ్గించారు. దిద్దిన పేపర్లు తిరిగి ఇచ్చేశారు. క్లాసులో చాలా సెక్షనులున్నాయి. ప్రతి సెక్షనులోనూ రుక్క్మిణి పార్టీవాళ్లే మెజారిటీ. ఓ సెక్షనులో వాళ్లంతా మూకుమ్మడిగా లేచారు. ఆ దిద్దిన మాస్టర్ని నిలదీశారు. కొందరు పిల్లలైతే ప్రశ్న పత్రం చూపించారు. "అందులో రుక్క్మిణి అనే వుంది గదా!" అన్నారు. ఆ మాస్టరు "రుక్క్మిణి తప్పు. సరియైన రూపం రుక్మిణి" అన్నాడు. "ఆ మాట పరీక్ష హాల్లో చెప్పలేదేం?" అన్నారు పిల్లలు. "పాఠం చెప్పినప్పుడు చెప్పా గదా" అన్నాడు మాస్టరు.

పిల్లలకు సంతృప్తి కలుగలేదు. కేసు హెడ్మాస్టరు దగ్గరకు వెళ్లింది. అది తెలిసి మిగిలిన సెక్షన్ల పిల్లలు కూడా వాళ్లతో కలిశారు. ఆ హెడ్మాస్టరు చక్కగా చదువుకున్నవాడు. సమస్యను పరిశీలించాడు. ఇది తానొక్కడే పరిష్కరించవలసింది కాదని, మాస్టర్లందర్నీ సమావేశ పరిచాడు. పిల్లల వాదన వినిపించాడు. ఆ మాస్టర్లలో పేపర్ సెట్టరున్నాడు. ప్రశ్న పత్రం అచ్చయ్యే వేళ ఆయన తప్పులు దిద్దలేదు. రుక్క్మిణి అని ప్రశ్న పత్రంలో అచ్చుకావడం తాను చూడలేదని, పరీక్ష జరి గిన రోజున తాను సెలవు పెట్టానని, హాజరై వుంటే తప్పు సవరించి వుండేవాణ్ణని ఆయన సర్దిచెప్పాడు.

ఆ మాస్టర్లలో గడుసు వాడొకడున్నాడు. ఆయనకీ, పేపరు సెట్టరుకీ స్నేహం. ఆయన 'రుక్క్మిణి' తప్పు కాదన్నాడు. రుక్మిణి సాక్షాత్తు లక్ష్మి అవతారం. ఆ విషయం గుర్తు చేయడానికే విద్యార్థి ఆ రెండు పేర్లను కలిపి రుక్క్మిణి అని వ్రాసి వుంటాడని సమర్థించాడు. మాస్టర్లలో ఈ గడుసువాడంటే పడనివాడున్నాడు. ప్రసిద్ధమైన గైడ్‌లో రుక్క్మిణి అనే వున్నదనీ, విద్యార్థులు దాన్ని బాగా చదివిన కారణాన రుక్క్మిణి అని వ్రాసి వుంటారనీ ఆయన వివరించాడు. ప్రశ్న పత్రం వ్రాసిన మాస్టరు ఆ గైడు చూసి వుండవచ్చునని చమత్కరించాడు. పేపరు సెట్టరుకు ఒళ్లు మండింది. తానైతే ఆ గైడు చూడలేదనీ, బహుశా ఆ గైడును ఈ పెద్దమనిషే వ్రాసి వుంటాడని ఎదురుదెబ్బ తీశాడు. ఆ మాస్టర్లలో ఓ వృద్ధుడున్నాడు. అసలు ప్రశ్న పత్రంలో ప్రేమ లేఖయ్యా ప్రశ్న వేసి వుండకూడదన్నాడు.

దాంతో ఓ కుర్ర మాస్టరుకు ఒళ్లు మండింది. ఆ వృద్ధుడు ఎడ్ల బండి యుగం వాడని, కాలం మార్పు తెలియకుండా మాట్లాడుతున్నాడని చురకవేశాడు. రుక్క్మిణి కృష్ణుడికి ప్రేమలేఖ వ్రాయవచ్చు. పెద్దలు దానికి సిలబస్‌లో సీటు కేటాయించవచ్చు. కాని పరీక్షలో మాత్రం ప్రేమలేఖ అని వాడకూడదా? అని దబాయించాడాయన. అలనాటి రుక్మిణి ఈ కాలపు ఆడపిల్లలందరికీ ఆదర్శమని, ఆమె భారతీయ మహిళ కావడం మనకు గర్వకారణమని, వ్యాసుడు పురాణ కాలంవాడైనా భాగవత కాలం నాటి ఈ అంశాన్ని విడవకుండా తన సంస్కృత భాగవతంలో వ్రాయడం నిజంగా అద్భుతమని ఓ చిన్నసైజు ఉపన్యాసం దంచాడు. అంతతో ఆగకుండా 'ఒక చిన్న తప్పు— రుక్మిణికి బదులు రుక్క్మిణి అని వ్రాసినందుకు అన్ని మార్కులు తగ్గించే అధికారం ఈ మాస్టరు కెవరిచ్చారన్నాడు.

హెడ్మాస్టరు కిదంతా విడ్డూరంగా తోచింది. మార్కులు తగ్గించిన మాస్టర్ని సమర్థించేవారు లేక పోయారు. "రుక్మిణి ప్రేమలేఖను వ్రాసింది కృష్ణుడికి కదటయ్యా! విద్యార్థి కృష్ణుడికి బదులు శిశుపాలుడని వ్రాసినా మార్కులిమ్మంటావా?" అని కుర్ర మాస్టర్ని ప్రశ్నించాడు. ఆ కుర్ర మాస్టరు కొంటెగా నవ్వి "ఇది ప్రజాస్వామ్య యుగం సార్! పిల్లవాడు రాసింది తప్పని కొట్టివేయరాదండీ! ఓటింగుకు పెట్టి మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించాలండీ!" అన్నాడు. ఇది విన్న హెడ్మాస్టరుకి మతిపోయింది. తనకిష్టం లేకపోయినా రుక్మిణి అనవలెనా? రుక్క్మిణి అనవచ్చునా — అని ఓటింగు పెట్టాడు. మాస్టర్లందరూ రుక్క్మిణికే ఓటు చేశారు, ఆ ముసలి మాస్టరు, మార్కులు తగ్గించిన మాస్టరు తప్ప.

—చిట్టా దామోదరశాస్త్రి

# సుకన్యా స్టీలుసామాను

సుకన్యకు స్టీలుసామాను కొనడమన్నా, అందమైన చీరలు సెలెక్ట్ చేయడమన్నా ఎంతో ప్రీతి. భర్తకు జీతంరాగానే స్టీలుసామాను కొనడానికని కనీసం ఓ ముప్పై రూపాయిలన్నా ఖర్చు చేయించకపోతే ఓ వారం దాకా నిద్రపట్టేదికాదు ఆమెకు. అతి కొద్ది కాలంలోనే వాళ్ళిల్లు ఓ స్టీలు సామాను షాపుగా మారినా ఆశ్చర్య పోనక్కర్లేదు అని చెవులు కొరుక్కునేవారు అమ్మ లక్కలు. భర్త విసుగుతో, "ఇదేం పిచ్చి" అనేవాడు.

సుకన్య నవ్వేది. "అంత కోపమైతే నేనెంత బాధ పడతానో తెలుసా?" అనే పాట టేపురికార్డులో విన్పించేది. పాపం! భర్త నోరుకుట్టేసినట్లుగా మారి అక్కడ్నుండి వెళ్ళిపోయేవాడు.

తను కొన్న స్టీలు సామానంతా ఎగ్జిబిషన్‌లోలా అమర్చి ఓ రోజు స్నేహితురాండ్రుని, పక్కింటివాళ్ళని పిలుచుకవచ్చి చూపించింది. వాళ్ళల్లో ఈర్ష్య పడిన వాళ్ళని విస్తుపోయి ముక్కున వేలేసుకున్న వాళ్ళని చూసి తనలో తను నవ్వుకుంది. గర్వంగా ఉప్పొంగి పోయింది సుకన్య.

"ఇలాంటి పిచ్చిపనులు చేశావంటే, ఏ దొంగాడో కనిపెట్టి ఈ సామానే కాదు ఇంట్లో వున్న ఆ కాస్త సామానులు కూడా దోచుకుపోతాడే!" అంటే—

"ఎవడువాడు, ఎచటివాడు, ఇటువచ్చే దొంగవాడు..." అంటూ పాడేది సుకన్య.

ఇంకేమనాలో తోచక, "నీ యిష్టం ఏమైనా ఏడు" అనేసి వెళ్ళిపోయేవాడు భర్త.

ఒక రోజు ఆ వీథిగుండా స్టీలుసామాను ఓ గంపలో వేసుకుని నెత్తిన పెట్టుకుని అమ్ముతూ ఓ యువకుడు రావడం కన్పించడం, వాడేసిన కేకలు విన్పించాయి. సుకన్య పరుగు పరుగున బయటకొచ్చింది.

"ఓ అబ్బీ! ఇలారా" అని పిలిచింది. అతను రాగానే, ఆమె ఆజ్ఞ కాగానే గంపను క్రిందకు దించాడు అతను. సుకన్య వివిధ రకాల వస్తువుల్ని చూసి ముచ్చటపడింది. బేరం మొదలుపెట్టింది. వాడు జరీ అంచుచీర పాతదుంటే ఇవ్వమన్నాడు. కనీసం పేంటో, షర్టో, పాత గుడ్డలో అని అడిగాడు. సుకన్య పరవశత్వం చెందుతూ, "డబ్బులకే తీసుకొనేది. వీటి ధర చెప్పు"మని అడగ సాగింది. ఆ అబ్బి ధరలు చెప్తూ, చెప్తూ అటు ఇటు చూసి ఠకీమని సుకన్య మెడలోని లాకెట్ పట్టుకులాగి తెంపుకుని పారిపోయాడు. సుకన్య హతాశురాలైంది. 'దొంగ, దొంగ' అని అరిచింది. చివరకు న్యూస్ పేపర్ చదువుకుంటూ ఇంట్లో వున్న భర్త కూడా పరిగెత్తుకొచ్చాడు. అప్పటికే వాడు పారిపోయాడు. "పాపం! లాకెట్ లాక్కెళ్ళాడని" గుసగుసలు పోతుంటే సుకన్య నవ్వుతూ, "పోతేపోయింది. బోడి లాకెట్టు— గంపెడు స్టీలుసామానొచ్చింది" అంది. అందరూ విస్తుపోయి చూశారు. "అదంతే! ఆ లాకెట్టు బంగారంది కాదు. ఆ మధ్య కొన్న రోల్డ్‌గోల్డ్‌ది" అంది విజయగర్వంగా. ఈసారి అందరితోపాటు భర్త హతాశుడై చూస్తుండి పోయాడు.

— "ఉమ్మెత్తల"